సాక్షి విశాఖపట్నం


శుక్రవారం । 17 । జనవరి । 2025



నేటి నుంచి రహదారి భద్రతా మాసోత్సవాలు 8లో



మార్వాడీ క్రికెట్ లీగ్ విజేత పరశురామ్ ఎలెవెన్ 8లో



విశాఖ-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు 8లో

కానిస్టేబుల్ వెనుక ఏసీపీ?

కలెక్షన్లన్నీ కానిస్టేబుల్ ద్వారానే..



- ఆయన అకౌంటు ద్వారా రూ. కోట్లలో లావాదేవీలు?
- అనకాపల్లి నుంచి సిటీకి పోస్టింగులోనూ ఏసీపీదే కీలకపాత్ర
- కూటమి ఎమ్మెల్యేల వ్యవహారంపై ఇప్పటికే ఫిర్యాదులు
- బెట్టింగ్ ముఠా పట్టుబడిన సమయంలో దొరికిన నగదుపైనా విచారణ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో సస్పెండైన స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) కానిస్టేబుల్ పల్లా గంగరాజు వ్యవహారం వెనుక ఓ ఏసీపీ ఉన్నట్టు చర్చ జరుగుతోంది. సదరు ఏసీపీ ద్వారానే వ్యవహారాలన్నీ ఈ కానిస్టేబుల్ చక్కబెడుతున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా కూటమి ఎమ్మెల్యేల పాత్రపైనా ఇప్పటికే పలు ఫిర్యాదులు వచ్చినట్టు సమాచారం. ప్రధానంగా అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేకు బంధువు, పీఏగా చెప్పుకుంటున్న ఓ వ్యక్తికి ఉన్న లింకులపైనా ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మొన్నటి వరకు అనకాపల్లిలో విధులు నిర్వహించిన ఈ కానిస్టేబుల్.. ఏసీపీ ద్వారానే బదిలీ చేసుకుని విశాఖ సిటీకి వచ్చినట్టు సమాచారం. మొత్తంగా క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో కానిస్టేబుల్ సెల్ నంబరు ద్వారా జరిపిన లావాదేవీలన్నీ గుర్తించే పనిలో పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారు. అంతేకాకుండా కేవలం కానిస్టేబుల్ అకౌంటు ద్వారా రూ.లక్షల్లో లావాదేవీలు జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు కానిస్టేబుల్ ద్వారా నిరంతరాయంగా సంభాషిస్తూ.. ప్రతి నెలా మామూళ్లు దండుకుంటున్న ఓ ఎమ్మెల్యేతో పాటు మరో ఎమ్మెల్యే పీఏ వ్యవహారం కూడా త్వరలో బయటపడే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం.

గతంలో టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన సమయంలోనూ సదరు ఏసీపీ ఈ కానిస్టేబుల్‌కు తన వద్దనే పోస్టింగ్ ఇప్పించుకున్నారు. అప్పటినుంచి వీరి బంధం రోజురోజుకీ బలపడినట్టు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన సమయంలో ఎక్కడెక్కడ ఎంత మొత్తం వసూలు చేయాలి? తనకు ఎక్కడ ఇవ్వాలనే వివరాలన్నీ సదరు ఏసీపీ డైరెక్షన్‌లోనే పనిచేసేవారని పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది. స్పాలు మొదలుకుని, బ్లాక్ ఆయిల్ దందా, పేకాట డెన్ నిర్వాహకులతో పాటు గంజాయి బ్యాచ్ నుంచి కూడా వసూళ్లకు తెగబడినట్టు విమర్శలున్నాయి. ఈ విధంగా వసూలు చేసిన మొత్తాన్ని ఏసీపీకి అందజేయడంలో కీలకపాత్ర ఈ కానిస్టేబుల్ పోషించారనే తెలుస్తోంది. వీరిద్దరి డిపార్టుమెంట్లు వేరువేరుగా ఉన్నప్పటికీ..ఆర్థిక బంధం మాత్రం యథావిధిగా కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. తాజా వ్యవహారంలో కూడా ఏసీపీ పాత్రపైనా 'గట్టి' విచారణ జరపాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం పోలీసుశాఖలో వినిపిస్తోంది.

నెల నెలా మామూళ్లు...!


స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌తో అవినాభావ సంబంధం ఉన్న కూటమిలోని ఓ ఎమ్మెల్యేకు నెల నెలా మామూళ్లు ముడుతున్నాయని కూడా తెలుస్తోంది. క్రికెట్ బెట్టింగ్ ముఠా నుంచి మామూళ్లు అందజేయడంలో ఈ కానిస్టేబుల్ కీలకపాత్ర పోషించినట్టు సమాచారం. మరోవైపు తెలుగుదేశం పార్టీకి చెందిన మరో కీలక ఎమ్మెల్యే పీఏనని చెప్పుకునే దూరపు బంధువు పాత్ర కూడా కీలకంగా ఉంది. వాస్తవానికి క్రికెట్ బెట్టింగ్ ముఠాను పట్టుకున్న తర్వాత టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఫోన్ చేసి బెదిరించిన వ్యవహారంలో ఈ పీఏ వ్యవహారశైలిపై కూడా సీపీ సీరియస్‌గా ఉన్నట్టు పోలీసుశాఖలో చర్చ జరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారంపై 'చిట్టి'గా కాకుండా 'గట్టి'గా విచారణ జరిపితే దొంగలందరూ బయటకు వస్తారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సెల్ ఫోన్ లింకులపై సీపీ దృష్టి

వాస్తవానికి స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) కానిస్టేబుల్ ఫోన్ నంబరును పరిశీలిస్తే మరిన్ని లింకులు బయటపడే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు సదరు కానిస్టేబుల్ అకౌంట్ ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది. డిపార్టుమెంటులో ప్రస్తుతం పనిచేస్తున్న పలువురు పోలీసులకు కూడా తన ఫోన్ పే ద్వారా నగదును బదిలీ చేశారని సమాచారం. తాజాగా టాస్క్‌ఫోర్స్‌లోని కొంత మందికి కూడా క్రికెట్ బెట్టింగ్ ముఠాలోని సభ్యుల నుంచి ఫోన్ పే ద్వారా నగదు బదిలీ జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపైనా విచారణ జరిపితే మరింత మంది డిపార్టుమెంటు దొంగలు బయటపడే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు క్రికెట్ బెట్టింగ్ ముఠాలో కీలక పాత్ర పోషిస్తున్న లగుడు రవిని పట్టుకున్న సమయంలో కూడా భారీగానే నగదు దొరికిందనే ప్రచారం జరుగుతోంది. దీనిపైనా ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నట్టు సమాచారం. ఈ నగదును చూపకుండా తప్పించిన వ్యవహారం ఇప్పుడు పోలీసుశాఖలో హాట్ టాపిక్‌గా మారింది.



జంతు ప్రపంచం... దత్తత మీ ఇష్టం..!



మీకే జంతువంటే ఇష్టం..! తెల్లపులి...ఏనుగు...సింహం...జిరాఫీ....ఖడ్గమృగం... చింపాంజీ...లేళ్లు...ఇవే కాదు..నెమళ్లు...రకరకాల పక్షులు, తాబేళ్లు...మొసళ్లు...పాములు...! ఏవైనా సరే వన్యప్రాణులంటే ప్రేమ చూపేవారు జంతు సంరక్షణ పట్ల ఎంతో మక్కువ చూపుతారు. జంతువులంటే మనకు ఎంత ప్రేమ ఉన్నా వన్యప్రాణులను మనం పెంచుకోలేం...కానీ వాటి సంరక్షణకు ఇతోధికంగా సహాయపడవచ్చు. జూలో జంతువులను దత్తత తీసుకుని నెలకు, ఆరు నెలలకు, లేదా సంవత్సరం పాటు వాటికి ఆహారం అందించడానికి ఎందరో జంతు ప్రేమికులు బాధ్యతగా తీసుకుని ఆర్థికంగా సహాయపడుతున్నారు. అలా దత్తత తీసుకున్న వారిలో వ్యక్తులు, సంస్థలు కూడా ఉన్నాయి. మీకూ ఆసక్తిగా ఉందా... 8లో

'నవోదయ' పరీక్ష నిర్వహణకు పక్కా ఏర్పాట్లు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 18న జరగనున్న పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా 39 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. నవోదయ ప్రిన్సిపాల్ డా. వై.ఎస్.ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 39 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని, 9,080 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వెల్లడించారు. మూడు జిల్లాలకు చెందిన పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, పరిశీలకులకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉక్కు రక్షణకై 19న పాత గాజువాకలో నిరసన



మాట్లాడుతున్న డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ నేత రెడ్డి వెంకటరావు


సీతమ్మధార: విశాఖ ఉక్కు పోరాటంలో భాగంగా ఈ నెల 19న పాత గాజువాకలో జరిగే ఉక్కు పరిరక్షణ పోరాటంలో విశాఖ ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలను గురువారం డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకుడు రెడ్డి వెంకటరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నిటినీ ప్రైవేటీకరించడానికి కంకణం కట్టుకుందని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమం ద్వారా స్థాపించిన పరిశ్రమ అని, 32 మంది ప్రాణ త్యాగాలు, 64 గ్రామాల ప్రజల భూములు, దేశ వ్యాప్త నిరసనలు వెరసి విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పడిందని గుర్తు చేశారు. ఉక్కు ప్రైవేటీకరణ ప్రకటన మొదలు నాలుగేళ్లుగా నిర్విరామంగా కార్మిక, రైతు, ప్రజా సంఘాలు విశాఖ ఉక్కు రక్షణ పోరాటంలో పాల్గొంటున్నాయన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేసి, కార్మికులకు బకాయి జీతాలు చెల్లించేంత వరకు ఈ పోరాటం కొనసాగుతుందన్నారు. పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకుడు కుమార్ మంగళం, డిఫెన్స్ యూనియన్ నాయకులు గోపాలకృష్ణ, జగన్నాథం, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు ఎన్.వి.రమణ, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, చలపతి, కుమారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెండో విడత సదరం తనిఖీలు

మహారాణిపేట : సదరం రెండో విడత తనిఖీలకు అధికారులు సిద్ధమవుతు న్నారు. శనివారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్టీఆర్ భరోసా దివ్యాంగుల పథకం కింద నెలకు రూ.15వేలు పింఛన్లు తీసుకుంటున్న ఇళ్లకు పలు శాఖల అధికారుల బృందం వెళ్లనున్నారు. జిల్లాలో సదరం సర్టిఫికెట్ల ద్వారా నూరు శాతం పర్సంటేజీతో 319 మంది నెలకు రూ.15వేలు పింఛను పొందుతున్న సంగతి తెలిసిందే. తొలి విడత ఈనెల 9వ తేదీన మూడు ప్రాంతాల్లో విచారణ పూర్తి చేశారు. రెండో విడతలో దీర్ఘకాలిక వ్యాధులు, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచం పట్టిన బాధితులు, మానసిక వ్యాధులతో మంచం పట్టిన బాధితుల ఇళ్లకు వెళ్లడానికి మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఆశీల్‌మెట్ట జోన్ పరిధి, భీమిలి, మధురవాడ ప్రాంతాల్లో వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి సదరం సర్టిఫికెట్, దివ్యాంగుల స్థితిగతులు విచారణ చేయనున్నారు.

అప్పన్న బంగారం, వెండి వస్తువుల తనిఖీ నేడు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి భక్తులు కానుకగా సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన ఆభరణాలను దేవదాయ శాఖ శుక్రవారం తనిఖీ చేయనుంది. దేవస్థానానికి భక్తులు సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువుల వివరాలను బహిర్గతం చేయాలని, వాటికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో తెలియజేయాలని కడప జిల్లాకు చెందిన కె.ప్రభాకరాచారి గతేడాది నవంబర్‌లో దేవదాయ శాఖలో పిటిషన్ వేశారు. దీంతో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ డిసెంబర్‌లో విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం జోన్-1 ఆర్జేసీ, నగల తనిఖీ అధికారులతో కూడిన కమిటీ శుక్రవారం విచారణ చేపట్టనుంది.

ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?

- అవగాహన లోపమా? సిబ్బంది నిర్లక్ష్యమా..??
- నగరంలో విచ్చలవిడిగా వినియోగం



నగరంలో పాలిథిన్ వినియోగిస్తున్న మహిళలు



దాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో జనవరి ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. పేరుకే నిషేధం గానీ పాలిథిన్ కవర్ల వినియోగం ఏ మాత్రం తగ్గలేదు. యావత్ ప్రపంచాన్ని శాసిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని విశాఖ నగరం నుంచి తరిమి కొట్టాలని, ప్లాస్టిక్‌పై ఐదేళ్లుగా ప్రజలకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి రెండు నుంచి మూడొందల ఏళ్లు పడుతుందని, మానవాళితో పాటు జల, చర జీవరాసులకు ఎంతో హాని కలుగుతూ, తద్వారా క్యాన్సర్, భయంకర వ్యాధులు సంభవిస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించింది. వీటికి బదులు ప్రత్యామ్నాయ వస్తువులు అందుబాటులోకి తెచ్చింది. అందుకు తగిన విధంగా మార్కెట్లు, రైతు బజార్లు, పండ్ల దుకాణాలు వద్ద అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఇప్పటికే ప్రత్యామ్నాయాలు, ఇన్‌స్పెక్షన్ సిద్ధాంతాలపై స్కిల్ అప్ గ్రెడేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కార్యక్రమంతోపాటు, శిక్షణ కార్యక్రమం పక్షం రోజుల క్రితమే నిర్వహించారు.

మరి ఎక్కడ లోపం?

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ అధికారులు..సిబ్బంది అంత సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. అంతేగాక అవగాహన కార్యక్రమాలు ప్రజల్లోకి లోతుగా వెళ్లలేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఫలితంగా నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమలు కావడం లేదు.

హెచ్చరించినా పట్టించుకోవడం లేదు

జనవరి ఒకటి నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకు 120 మైక్రాన్ల లోపు ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడిన దుకాణాల నుంచి అపరాధ రుసుముతో పాటు వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న చిన్న వ్యాపారస్తులకు మొదటిసారి రూ.2,500, రెండోసారి రూ.5వేలతో పాటు వారి ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. జీఎస్టీ పరిధిలో గల పెద్ద వ్యాపారస్తులు.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించినా, సరఫరా చేసినా, వినియోగించినా, తయారు చేసినా మొదటిసారి పట్టుబడితే రూ.20వేలు, రెండోసారి పట్టుబడితే రూ.40వేల అపరాధ రుసుంతో పాటు వారి అన్ని వ్యాపార లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ హెచ్చరికలు ఎవరూ పట్టించుకోవడం లేదు.

సహకరించండి



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి అంతా సహకరించాలి. యావత్ ప్రపంచాన్ని శాసిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని విశాఖ నగరం నుంచి తరిమి కొడదాం. ప్లాస్టిక్ నియంత్రణపై ఐదేళ్లుగా ప్రజలకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ వస్తువులు అందుబాటులో ఉన్నాయి. వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించాలి.

–గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

కఠిన చర్యలు



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై విస్తృతంగా అవగాహన కల్పించాం. ఒక్క రోజులోనే 27 వేల వ్యాపార, వాణిజ్య సముదాయాల వద్ద 'సే నో టు ప్లాస్టిక్' క్యూఆర్ కోడ్ కల్గిన స్టిక్కర్లు అతికించాం. నగర ప్రజలు, వ్యాపార, వినియోగదారులు, కొనుగోలుదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించాలి. ఎవరైనా వినియోగిస్తే చర్యలు తప్పవు.

– పి.సంపత్‌కుమార్, కమిషనర్, జీవీఎంసీ

రైల్వే స్టేషన్ కిటకిట

పండగ సెలవులు పూర్తికావడంతో వివిధ ప్రాంతాల నుంచి సొంత ఊర్లకు వచ్చినవారంతా తిరుగు ప్రయాణమవుతున్నారు. దీంతో రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. గురువారం అన్ని రైళ్లు తీవ్ర రద్దీతో నడిచాయి.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



వీఆర్ఎస్ బాటలో.. ఉక్కు ఉద్యోగులు

- రెండు రోజుల్లో 384 మంది దరఖాస్తు
- నెలాఖరు వరకు దరఖాస్తు గడువు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) పథకానికి ఉద్యోగుల నుంచి స్పందన లభిస్తోంది. బుధవారం నుంచి దరఖాస్తుకు పోర్టల్ అందుబాటులో ఉంచారు. మొదటి రోజు 192 మంది దరఖాస్తు చేశారు. రెండవ రోజు ఆ సంఖ్య 384కు చేరింది. వీరిలో అధికారులు 184, కార్మికులు 200 మంది ఉన్నారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉండటంతో.. ఎక్కువ మంది దరఖాస్తు చేసే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. స్టీల్‌ప్లాంట్‌లో రోజురోజుకు దిగజారిపోతున్న పరిస్థితులకు ఈ దరఖాస్తులు అద్దం పడుతున్నాయి. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఎల్‌టీఏలు నిలిపివేయడంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు అధికారులకు 6 శాతం పెర్క్స్ తొలగించగా, కార్మికులకు హెచ్ఆర్ఏ నిలిపివేత, ఉక్కు క్వార్టర్ల నివాసులకు విద్యుత్ చార్జీల పెంపు ద్వారా తీవ్రమైన ఆర్థిక భారం మోపారు. అదనపు ప్రయోజనాలు ఎన్ని తొలగించినా.. జీతమైనా సరిగా ఇస్తున్నారంటే అదీ లేదు. గత నాలుగు నెలలుగా యాజమాన్యం ఉద్యోగులకు 250 శాతం జీతం పెండింగ్‌లో పెట్టింది. పీఎఫ్ ట్రస్ట్, ఎస్ఏబీఎఫ్ ట్రస్టు, థ్రిఫ్ట్ సొసైటీలకు సుమారు రూ.వెయ్యి కోట్లు బకాయి పడటంతో ఉద్యోగులకు మరింత నష్టం కలిగిస్తోంది. మరోవైపు ఈ ఏడాది నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సక్రమంగా చెల్లించట్లేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల్లో భయం, అభద్రతా భావం పెరిగిపోయింది. ఎంత వేగంగా ప్లాంట్ నుంచి బయటపడదామా అని ఉద్యోగులు భావిస్తున్నారు. ఈ నెలాఖరుకు ఎంత మంది దరఖాస్తు చేస్తారో వేచి చూడాలి.

క్లుప్తంగా

'జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్' దరఖాస్తు గడువు పెంపు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో 8 మంది స్టాండింగ్ కౌన్సిల్స్‌ను నియమించేందుకు న్యాయవాదుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 8 మంది న్యాయవాదుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 6తో ముగిసిందని, పలువురి అభ్యర్థన మేరకు ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీ (ఓసీ-జనరల్)లో 4, బీసీ ఏ-1, ఎకనామికల్లీ వీకర్ సెక్షన్-1, ఎస్టీ-1, బీసీ బీ-1 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బార్ కౌన్సిల్‌లో కనీసం పదేళ్ల సభ్యుడిగా రిజిస్ట్రేషన్ పొంది ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. బార్ కౌన్సిల్‌లో ఈ సమాచారం పొందుపరిచామని, దరఖాస్తులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ సూచించారు.

పట్టణ ప్రణాళిక విభాగ వినతుల స్వీకరణ నేడు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి శుక్రవారం ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి విభాగం అధికారులు వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

వ్యసనాలకు బానిసై యువకుడి ఆత్మహత్య?

గోపాలపట్నం: వ్యసనాలకు బానిసైన 19 ఏళ్ల కట్టోజి అజయ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన 89వ వార్డు చంద్రానగర్‌లో జరిగింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. అజయ్, అతని తల్లి కామాక్షి చంద్రానగర్‌లో నివాసం ఉంటున్నారు. అజయ్ తల్లి బుధవారం తన స్వగ్రామమైన పార్వతీపురం వెళ్లింది. తనతో రావాలని ఆమె కోరినా అజయ్ నిరాకరించాడు. రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న గోపాలపట్నం పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు. అజయ్ 10వ తరగతి ఉత్తీర్ణుడై, పని లేకుండా తిరుగుతున్నాడు. అతనికి అక్క ఉంది. తండ్రి గతంలో మరణించాడు. వ్యసనాలకు బానిసైన అజయ్ డబ్బుల కోసం తల్లిపై దాడికి పాల్పడిన ఘటనలు ఉన్నాయి. తల్లి ఫిర్యాదు మేరకు అతనిపై పోలీసులు హత్యాయత్నం కేసు కూడా నమోదు చేశారు. తర్వాత తల్లి ఇచ్చిన జామీను ద్వారా బయటకు వచ్చాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయ అటెండర్ మృతి


ముస్తాఫా (ఫైల్)

సీతమ్మధార : రోడ్లు భవనాల శాఖ క్వార్టర్లలో నివాసం ఉంటున్న అటెండర్ పొరపాటున పురుగు మందు తాగి మరణించారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలివీ. భీమిలి తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ముస్తాఫా(48) భార్య మహ్మద్ ఫాతిమా, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఐదేళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నారు. ముస్తాఫా పెద్ద కుమార్తె ఎం.డె.సుఫియా పీజీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా, రెండో కుమార్తె రఫియా ఇంటర్ పూర్తి చేసి అనారోగ్యం కారణంగా ఇంట్లోనే ఉంటోంది. కాగా.. ఇంటి వరండాలోని పువ్వులు, పండ్ల మొక్కల కోసం ఈ నెల 14న ముస్తాఫా పురుగు మందు తీసుకొచ్చారు. ఎప్పటిలాగే మంగళవారం సాయంత్రం మందు తీసుకుని మొక్కలకు కొట్టడానికి గ్లాసులో సిద్ధం చేయగా.. అతని భార్య, కుమార్తెలు చీకటి కావడంతో తెల్లవారుజామున వేయమని చెప్పారు. మధుమేహం కారణంగా అతను ప్రతి రోజూ కాకరకాయ జ్యూస్ తాగుతున్నారు. ఈ తరుణంలో బుధవారం కాకరకాయ జ్యూస్ అనుకుని పురుగు మందును పొరపాటున తాగేశారు. వెంటనే అతన్ని ఆటోలో రామ్‌నగర్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం చనిపోయారు. అతని భార్య ఫిర్యాదు మేరకు ద్వారకా సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జంతు ప్రపంచం... దత్తత మీ ఇష్టం..!




తెల్ల పులి


నీటి ఏనుగు


చింపాంజీ





అరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణులను జూ అధికారులు దత్తత ఇస్తున్నారు. ఇందుకు దాతలు కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దాతల పేరుతో జూ సిబ్బంది వాటికి ఆహారం అందిస్తారు. జూలో ఏ జంతువు, ఏ పక్షిని దత్తత తీసుకుంటే వాటి ఎన్‌క్లోజరు వద్ద వాటి ఫొటోతో పాటు దాతల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం పలువురు దాతల పేర్లతో కూడిన బోర్డులను వారు దత్తత తీసుకున్న వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద ఏర్పాటు చేశారు.

ఆకర్షణీయంగా దాతల పేర్లతో బోర్డులు

జూ పార్కులో వివిధ జాతులకు చెందిన జంతువులు, రకరకాల పక్షులు, తాబేళ్లు, మొసళ్లు, పాములు సందర్శకులను అలరిస్తుంటాయి. వాటిపై దాతలు ప్రేమ, వాత్సల్యం చూపుతూ జూ అధికారులకు సహకరిస్తున్నారు. వాటిని దత్తత తీసుకుని నెలకు, ఆరు నెలలకు, సంవత్సరానికి ఆహారం అందించడానికి కొంత మొత్తం చెల్లిస్తున్నారు. ఇక్కడ తెల్ల పులి, ఖడ్గమృగం, జిరాఫీ తదితర పెద్ద జంతువులను పలు కంపెనీలు ఏడాది పాటు దత్తత తీసుకున్నాయి.

- ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ జిరాఫీని ఒక ఏడాది పాటు దత్తత తీసుకుంది.
- ఐవోసీఎల్ కంపెనీ ఖడ్గమృగాన్ని ఏడాది కాలం దత్తత తీసుకుంది. మరో ఏడాది దత్తత కొనసాగించడానికి ఇటీవలే ఆ కంపెనీ ముందుకు వచ్చింది.
- ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ తెల్ల పులిని ఏడాది పాటు దత్తత తీసుకుంది.
- చిన్న జంతువులు, పక్షులను కొందరు నెల, ఆరు నెలలు పాటు దత్తత తీసుకొని ఆహారం అందిస్తున్నారు. ఆయా ఎన్‌క్లోజర్ల వద్ద దాతల బోర్డులు కూడా ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఆదాయం పన్ను మినహాయింపు

ఇక్కడ వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి వ్యక్తులు, సంఘాలు, పరిశ్రమలు వారి శక్తి మేరకు సహకారం అందించవచ్చు. ఏనుగు నుంచి చిన్న పక్షి వరకు ఎవరైనా ఎంత కాలానికైనా దత్తత తీసుకోవచ్చు. వాటి కోసం ఒక రోజు, నెల, ఏడాది వారిగా అయ్యే ఖర్చు చెల్లించవచ్చు. జూలో వన్యప్రాణులను దత్తత తీసుకున్నవారికి ఆదాయం పన్నులో మినహాయింపు ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ దత్తత పద్ధతి 2011లో ప్రారంభించారు. అప్పటి నుంచి పలువురు దాతలు ముందుకొచ్చి ఇక్కడ పులులు, సింహాలు, ఏనుగులు, పక్షులకు ఆహారం అందిస్తున్నారు.


ఆస్ట్రిచ్


జీబ్రా

దాతలు ముందుకు రావాలి

జూలో వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలి. వాటికి ఆహారం అందించడంలో భాగస్వాములు కావాలి. ఇప్పటికే కొందరు దాతలు సంస్థల పరంగా, వ్యక్తిగతంగా ముందుకు వచ్చి కొన్ని జంతువులను, పక్షులను వారం, నెల, ఏడాది కాలానికి ఆహారం అందించడానికి దత్తత తీసుకున్నారు. ఎక్కువ మంది దాతలు స్పందించి ఇక్కడ వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తే మూగజీవాలకు సహకరించినవారవుతారు. దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

- జి.మంగమ్మ, జూ క్యూరేటర్

ఆహారం ఇలా..

సింహం, పులికి పశు మాంసం, చికెన్ ఆహారంగా వేస్తున్నారు. ఏనుగుకు రాగి సంగటి, చెరకు, గ్రాసం, అరటి దవ్వ, బెల్లం, కొబ్బరి కాయలు అందిస్తున్నారు. చింపాంజీలకు పళ్లు, కాయలు, పాలు ఆహారంగా వేస్తారు. జింకలు, కనుజులు, కొండ గొర్రెలు తదితర వాటికి గ్రాసం వేస్తారు. అన్ని పక్షులకు పలు రకాల పళ్ల ముక్కలు కోసి వేస్తారు. కోతులకు పళ్లు, వేరుశనగ పిక్కలు అందిస్తారు. నీటి ఏనుగుకు పళ్లు, కూరగాయలు, ఆకు కూరలు వేస్తారు. ఇలా ఇక్కడ వన్యప్రాణులన్నింటికీ వాటి ఆహారం కోసం రోజుకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

ఎంత మొత్తం చెల్లించాలంటే..

జంతువు / పక్షి దత్తతకు చెల్లించాల్సిన మొత్తం

జంతువు/పక్షి	రోజుకు	ఏడాదికి
ఏనుగు	రూ.1200	రూ.4,30,000
ఖడ్గమృగం	రూ.820	రూ.3,00,000
నీటి ఏనుగు	రూ.600	రూ. 2,00,000
సింహం	రూ.600	రూ.1,90,000
పెద్ద పులి	రూ.600	రూ.1,90,000
జిరాఫీ	రూ.500	రూ.1,80,000
చిరుత పులి	రూ.400	రూ.1,25,000
ఎలుగుబంటి	రూ.300	రూ.1,10,000
చింపాంజీ	రూ.210	రూ.75,000
అడవి దున్న	రూ.200	రూ.73,000
జీబ్రా రెండింటికి	రూ.330	రూ.60,000 (ఒక జీబ్రాకు)
తోడేళ్లు రెండింటికి	రూ.300	రూ.55,000 (ఒక తోడేలుకు)
రేచుకుక్క	రూ.135	రూ.50,000
చుక్కల దుప్పి	రూ.100	రూ.36,500
రింగ్‌టైల్డ్ లెమూర్‌కు	రూ.100	రూ.36,500

ఇవి కాకుండా...

మొసలి/ఘరియల్ రెండింటికి రోజుకు	రూ.150	రూ.24,000 (ఏడాదికి ఒకదానికి)
హంసలు (రెండింటికి 2 రోజులకు)	రూ.100	రూ.18,000 (ఒక హంస)
నక్షత్ర తాబేళ్లు (పదింటికి ఐదు రోజులకు)	రూ.150	రూ.11,000
సారస్ కొంగ/నిప్పుకోడి/ పాములు (నాలుగు రోజులకు)	రూ.100	రూ.10,000 (ఒకదానికి)
గుడ్లగూబలు (నాలుగింటికి ఒకరోజుకు)	రూ.100	రూ.9,500 (ఒక దానికి)
మకావ్‌లు (నాలుగింటికి మూడు రోజులకు)	రూ.100	రూ.3,000 (ఒక దానికి)
పీజియన్/నెమళ్లు (నాలుగింటికి నాలుగు రోజులకు)	రూ.100	రూ.2,200 (ఒక దానికి)
ఆఫ్రికన్ చిలుకలు/రామచిలుకలు (ఐదు రోజులకు)	రూ.100	రూ.1500 (ఒకదానికి)
లవ్ బర్డ్స్ (పదింటికి ఐదు రోజులకు)	రూ.100	రూ.1,000 (ఒకదానికి)

మార్వాడీ క్రికెట్ లీగ్ విజేత పరశురామ్ ఎలెవెన్

విశాఖ స్పోర్ట్స్: మార్వాడీ క్రికెట్ లీగ్ విజేతగా పరశురామ్ ఎలెవెన్ జట్టు నిలిచింది. రైల్వే మైదానంలో గురువారం జరిగిన ఫైనల్స్‌లో పరశురామ్ జట్టు, మహాకాళీ జట్టుతో తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన పరశురామ్ జట్టు 12 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసింది. ప్రతిగా మహాకాళీ జట్టు 53 పరుగులకే ఆలౌట్ అయింది. మహాకాళీ ఉద్యోగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 11 జట్లు పాల్గొన్నాయి. ముగింపు కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హాజరై విజేతలకు ట్రోఫీతో పాటు రూ.41,000, రన్నర్‌ప్‌కు ట్రోఫీతో పాటు రూ.31,000 చెక్కులను అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయన్నారు.

పోలీస్ శాఖలో అవినీతిని సహించేది లేదు

పోలీస్ శాఖలో అవినీతిని సహించేది లేదని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. విధుల్లో అవినీతికి పాల్పడిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ గంగరాజును సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగర స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీ గంగరాజు క్రికెట్ బుకీలతో సంబంధాలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో ఆయన్ని తక్షణమే విధులు నుంచి తొలగించినట్లు చెప్పారు. పోలీస్ శాఖలోని అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని, ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా లంచం అడిగినా, తీసుకున్నా వెంటనే తనకు 79950 95799 నంబర్‌లో తెలియజేయవచ్చన్నారు. తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

విశాఖ-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖ విద్య: సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. విశాఖపట్నం- చర్లపల్లి- భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైలు(08549/08550) నడుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. రైలు నంబర్ 08549 విశాఖపట్నంలో ఈ నెల 18న సాయంత్రం 7.45 గంటలకు బయలుదేరుతుంది. రాత్రి 8.18 గంటలకు దువ్వాడ చేరుకుని, 8.20 గంటలకు అక్కడ నుంచి బయలుదేరుతుంది. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. రైలు నంబర్ 08550 ఈ నెల 19న ఉదయం 9 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి సాయంత్రం 6.40 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. దువ్వాడలో 6.45 గంటలకు బయలుదేరి రాత్రి 7.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖలో రాత్రి 7.50 గంటలకు బయలుదేరి ఈ నెల 20వ తేదీ తెల్లవారుజామున 2.15 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది.

- విశాఖపట్నం-చర్లపల్లి (08509) ప్రత్యేక రైలు ఈ నెల 18న సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి 6.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి 6.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. చర్లపల్లి-విశాఖపట్నం(08510) ప్రత్యేక రైలు ఈ నెల 19న 10గంటలకు చర్లపల్లిలో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.32 గంటలకు బయలుదేరి రాత్రి 10.00 గంటలకు విశాఖపట్నం వస్తుంది.
- విశాఖపట్నం-చర్లపల్లి(08551) ప్రత్యేక రైలుఈ నెల 19న విశాఖపట్నంలో 6.20 గంటలకు బయలుదేరి సాయంత్రం 6.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 6.50 గంటలకు అక్కడ బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. చర్లపల్లి-విశాఖపట్నం(08552) ప్రత్యేక రైలు ఈ నెల 20న ఉదయం 10 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి రాత్రి 21.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.32 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు విశాఖపట్నం వస్తుంది. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైలు సేవలను వినియోగించుకోవాలని సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

ఏపీఎస్‌ఆర్టీసీ భద్రతా మాసోత్సవాలు ప్రారంభం


మాట్లాడుతున్న ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: ఏపీఎస్‌ఆర్టీసీలో భద్రతా మాసోత్సవాలను గురువారం ప్రాంతీయ మేనేజర్ బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ మాసోత్సవాలు ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ సురక్షితమైన ప్రయాణానికి మారుపేరుగా నిలిచిన ఏపీఎస్‌ఆర్టీసీని భద్రంగా నడుపుకోవాలని డ్రైవర్లకు సూచించారు. డ్రైవర్లు, మెయింటెనెన్స్ సిబ్బంది వాహనాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చే విషయంలో భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 17 నుంచి 22 వరకు మెయింటెనెన్స్ స్పెషల్ డ్రైవ్, 23న డ్రైవర్స్ డే సందర్భంగా సేఫ్టీ డ్రైవర్ కార్యక్రమాలు, 25 నుంచి 28 వరకు డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్‌పై శిక్షణ, 29 నుంచి ఫిబ్రవరి 4 వరకు డ్రైవర్లకు వైద్య పరీక్షలు, 5, 6 తేదీల్లో ఫ్యామిలీ కౌన్సెలింగ్, 7 నుంచి 10 వరకు రక్తదాన శిబిరాలు, రూట్ సేఫ్టీ ఆడిట్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజున రీజియన్ పరిధిలో ముగ్గురు ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు అందజేస్తామన్నారు. డిపో మేనేజర్లు గంగాధర్, అరుణ్‌కుమారి, సుధాకర్, సూపర్‌వైజర్లు మాధురి, రామకృష్ణ, హిమబిందు, ఈశ్వరరావు, గౌరీ పాల్గొన్నారు.

నేటి నుంచి రహదారి భద్రతా మాసోత్సవాలు

మహారాణిపేట: జిల్లాలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై రవాణా, పోలీసు శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు- 2025 పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇతరుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోవచ్చని, ప్రమాదాలు జరగకుండా సురక్షిత డ్రైవింగ్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్స్, రిటైర్డ్ ఏపీఎస్ ఆర్టీసీ సిబ్బందితో వలంటీర్లను గుర్తించి శుక్రవారం నుంచి శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ జి.ఆదినారాయణ, మోటార్ వెహికల్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా, పోలీస్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

రచయిత ఎంవీవీ పార్థివ దేహం ఏఎంసీకి అప్పగింత


ఏఎంసీ అనాటమీ విభాగానికి సత్యనారాయణ పార్థివదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

మహారాణిపేట: ప్రముఖ రచయిత, హేతువాది, సామాజిక కార్యకర్త, శరీర, అవయవదాన ఉద్యమకారుడు ఎంవీవీ సత్యనారాయణ(76) పార్థివ దేహాన్ని గురువారం ఆంధ్రా మెడికల్ కళాశాలకు అప్పగించారు. బుధవారం 'రవళి'పత్రికకు 'ప్రమాదం అంచున'సీరియల్ భాగాన్ని పూర్తి చేసి.. మిత్రులతో ఫోన్ సంభాషిస్తూ గుండెపోటుతో ఆయన కన్నుమూశారు. సత్యనారాయణ మృతి విశాఖ సాహితీ లోకంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన చివరి కోరిక మేరకు అతని భార్య సత్యవతి, కుమార్తెలు శిరీష, సౌజన్య, కుటుంబ సభ్యుల సహకారంతో, సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్,చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి పర్యవేక్షణలో ఏఎంసీ కాలేజీ అనాటమీ విభాగానికి ఎంవీవీ పార్థివదేహాన్ని దానంగా అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా శరీర అవయవ దాతల సంఘం సభ్యులు టి.శ్రీరామమూర్తి, రామ ప్రభు, పీలా హరిప్రసాద్, మంతెన వెంకట రాజు, విజ్ఞానంద తదితరులు పాల్గొన్నారు.

మంచు గుప్పిట్లో విశాఖ



నగరంలో అకస్మాత్తుగా వాతావరణంలో మార్పు కనిపించింది. కొన్ని రోజులుగా పొడి వాతావరణం ఉండగా, గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణం మారిపోయింది. పొగమంచు నగరాన్ని కమ్మేసింది. - ఏయూక్యాంపస్

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం